నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
3 | మహబూబ్‌నగర్, ఆదివారం 4 మే 2025 | NAGARKURNOOL

రైతన్నల రణం

- ధాన్యం అమ్ముకునేందుకు నిత్యం తప్పని నిరసనలు
- ఉమ్మడి జిల్లాలో రోడ్డెక్కుతున్న కర్షకులు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో తిప్పలంటూ ఆగ్రహం

రెండ్రోజులుగా రోడ్లపైనే..

- ధాన్యం అమ్ముకునేందుకు రైతులకు తప్పని పడిగాపులు

నారాయణపేటరూరల్, మే 3 : నారాయణపేట మండలంలోని వివిధ గ్రామాల్లో పండించిన వరిని అమ్ముకొనేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం పీఏసీసీఎస్, ఐకేపీ, మెప్మా ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ సెంటర్ల వద్ద గన్నీ బ్యాగుల కొరత తీవ్రంగా ఉన్నది. దీనికి తోడు పలు కేంద్రాల్లో ట్రాన్స్‌పోర్టు వాహనాల్లేక కొనుగోళ్ల ప్రక్రియకు ఆటంకంగా మారింది. రైస్ మిల్లుల వద్ద ప్రభుత్వం ధాన్యం సేకరి స్తుండడంతో పెద్ద ఎత్తున రైతులు వెళ్తున్నారు. నారాయణపేట సమీపంలోని సింగారం చౌరస్తా రైస్‌మిల్ వద్ద ధాన్యం లోడ్‌తో ట్రాక్టర్లు బారులుదీరాయి. ఒకటి రెండు రోజులైనా కొనుగోలు చేయకపోడంతో వెయిటింగ్ చార్జీలు తడిసి మోపడ మవుతుండగా.. రైతులకు మాత్రం పడిగాపులు తప్పడం లేదు. అధికారులు స్పందించి వెంటనే ఇబ్బందులను తీర్చాలని పలువురు రైతులు కోరుతున్నారు.

నారాయణపేట జిల్లా సింగారం చౌరస్తా సమీపంలో రైస్‌మిల్ వద్ద ధాన్యం లోడుతో ఉన్న ట్రాక్టర్లు

ఏదుల నీళ్లు డిండికి తరలించొద్దు

- ఉమ్మడి పాలమూరు వాసులు సమ్మతించరు
- పాలమూరు ప్రాజెక్టు ప్యాకేజీ-3ని పూర్తి చేయాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, మే 3 : ఏదుల రిజర్వాయర్ నుంచి నల్లగొండ జిల్లా డిండికి నీటిని తరలించే ఆలోచన ప్రభుత్వం మానుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో నీటిని మళ్లించడం ఉమ్మడి పాలమూరు జిల్లా రైతులు సమ్మతించడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఈనెల 1వ తేదీన సాగునీటి ప్రాజెక్టుల సందర్శించడంపై నాగం జనార్దన్‌రెడ్డి స్పందిస్తూ శనివారం ప్రకటన విడుదల చేశారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో నాగర్‌కర్నూల్ జిల్లాకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పడం సంతోషమే అయినా ఏదుల రిజర్వాయర్ నుంచి డిండికి నీటిని తరలింపును జిల్లా ప్రజల సమ్మతించరని పేర్కొన్నారు. అదనంగా 0.5 టీఎంసీల నీటిని తీసుకెళ్లాలంటే శ్రీశైలం ప్రాజెక్టు నుంచి లిఫ్ట్ చేసి తీసుకుపోవాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కెనాల్ ప్యాకేజీ-3లో సున్నపుతండా నుంచి కుడికిళ్ల వరకు దాదాపు మూడున్నర కిలోమీటర్ల మేరకు కెనాల్ అసంపూర్తిగా ఉన్నందున నార్లాపూర్ రిజర్వాయర్ నీటిని ఏదుల రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి వట్టెం, కర్వెన, ఉదండాపూర్ రిజర్వాయర్లకు నీరందదన్నారు. యుద్ధ ప్రాతిపదికన మూడున్నర కిలోమీటర్లు కెనాల్ పూర్తి చేస్తే జూలై మొదటి వరకు ఆ కాల్వ ద్వారా నీరు ఏదుల, వట్టెం తదితర రిజర్వాయర్లకు అందించే వీలుంటుందన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడున్నర కిలోమీటర్ల కాల్వ కోసం ప్రత్యేక అధికారిని నియమించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా శ్రీశైలం నుంచి ఎత్తి పోస్తున్న నీటిని 12 లక్షల ఎకరాలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన, ఉదండాపూర్ రిజర్వాయర్ల నుంచి ప్రధాన కాలువలు, పిల్ల కాల్వలు, పంట కాల్వలు నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే పేర్కొన్నారు. దానికి వేల ఎకరాల భూమి సేకరించాల్సి ఉంటుందని, కేవలం మాటలతో పని కాదన్నారు. నిజంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు మొదటి ప్రాధాన్యత ఇచ్చే వారైతే డిస్టిబ్యూటరీ నెట్‌వర్క్ వెంటనే చేపట్టి ఒక సంవత్సరం కాలంలో పూర్తి చేస్తే పాత మహబూబ్‌నగర్ జిల్లాకు లాభం చేకూరుతుందని, అప్పుడు రైతులు బాగుపడుతారన్నారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పంపుహౌస్ పక్కనే పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ అండర్ గ్రౌండ్ పంప్‌హౌస్ నిర్మించేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదని, అక్కడ జరిపిన బ్లాస్టింగ్‌లో మేము చెప్పినట్లుగానే బ్లాస్టింగ్ ప్రభావంతో 5 మోటర్లలో 2 మోటర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు వెచ్చించడం జరిగిందని, బీహెచ్ఈఎల్ నిపుణులు ఆ రెండు మోటర్లకు మరమ్మతు చేయడానికి కూడా వీలు లేకుండా నష్టం జరిగిందన్నారు. ఆవిధంగా రిపోర్టు ఇచ్చిన కారణంగా వాటి స్థానంలో కొత్తగా 2 మోటర్లను అమర్చి కాలువల సామర్థ్యాన్ని పెంచి రైతులు కోరుకునే విధంగా నీటిని అందించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఏదుల నుంచి నీటిని డిండికి మళ్లించడం ఈ జిల్లా ప్రజలు సమ్మతించడం లేదని, దీనికి దృష్టిలో ఉంచుకోవాలని, ఈప్రాంత రైతులకు అన్యాయం చేసే విధంగా ప్రాజెక్టుల విషయంలో ప్రవర్తిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

పాలమూరుకు ప్రపంచ సుందరీమణులు

- ఈనెల 16న జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి సందర్శన
- మూడంచల భద్రతకు ఏర్పాట్లు చేశాం
- పర్యాటకులకు సహకరించాలి..
- జోగుళాంబ మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ

పాలమూరులోని పిల్లలమర్రిని పరిశీలిస్తున్న ఐజీ, డీఐజీ, ఎస్పీ

మహబూబ్‌నగర్, మే 3 : ఈనెల 16న ప్రపంచ దేశాల నుంచి పాలమూరు జిల్లా పర్యటనకు 22 మంది సుందరీమణుల వస్తున్నారని జోగుళాంబ మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. వీరి పర్యటన నేపథ్యంలో మూడంచల భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని పిల్లలమర్రిని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ జానకితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 700 ఏండ్ల చరిత్ర ఉన్న పిల్లలమర్రిని సుందరీమణులు వీక్షించడానికి వస్తున్నారని తెలిపారు. ఆరోజు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు వెయ్యి మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచ సుందరీమణుల రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారని, ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా డీజీపీ ఆదేశాల మేరకు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వచ్చే పర్యాటకులు హుందాగా, క్రమశిక్షణతో వ్యవహరించాలని, పోలీసుల సూచనలు పాటించాలన్నారు. చిన్న పొరపాటు జరిగినా అది మన ప్రాంతానికి, రాష్ట్రానికి, దేశ ప్రతిష్టకు భంగం కలుగుతుందని హెచ్చరించారు. సమావేశంలో సీఐ గాంధీ నాయక్, ట్రాఫిక్ సీఐ భగవంత్‌రెడ్డి, ఎస్సై విజయ్ పాల్గొన్నారు.

వర్షం మిగిల్చిన నష్టం

మరికల్, మే 3 : శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షం మండలంలో అపార నష్టాన్ని మిగిల్చింది. వడగండ్ల తోడుతో పాటు భారీ వర్షం పడడంతో మండలంలోని తీలేరు, పెద్దచింతకుంట, పూసలపాడు, పల్లెగడ్డ, మరికల్, మాధవరం గ్రామాల్లో చేతికొచ్చిన వరి నేల కొరిగింది. వడ్లు రాలి పొలాల్లో పడ్డాయి. దీంతో రైతుల తోడుతో కౌలు రైతులకు తీరని నష్టం మిగిలింది. ఈదురుగాలులు నష్టాన్ని మిగిల్చాయి. ఆరబెట్టిన ధాన్యం వర్షార్పణమైంది. కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లుల వద్ద వారి లిమిట్ పూర్తి కావడంతో కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన చెందారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

అకాల వర్షంతో నేలకొరిగిన పంటను చూపుతున్న రైతు

వనపర్తిలో రోడ్డుపై బైఠాయించిన రైతులు, మద్దతు తెలియజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

తడిసిన ధాన్యం కొనాలని..

- వనపర్తి మార్కెట్ ఎదుట రైతుల ధర్నా
- కొనుగోలులో షరతులు విధించొద్దని డిమాండ్
- మద్దతు తెలియజేసిన బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి, మే 3 (నమస్తే తెలంగాణ) : అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో మార్కెట్‌లోని ధాన్యం తడిసిముద్దయింది. ఈ విషయం తెలుసుకొన్న బీఆర్ఎస్ నాయకులు మార్కెట్ వద్దకు చేరుకొని పాడైపోయిన ధాన్యం పరిశీలించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ సమక్షంలో నాయకులు రైతుల ఇబ్బందులపై వాకబు చేశారు. ధాన్యం నష్టపోవడంతో నిరసన చేపట్టిన రైతులకు మద్దతుగా రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని షరతులేకుండా కొనాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని వాపోయారు. అనంతరం బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ నెల రోజులుగా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేయకుండా తాత్సారం చేయడంతో వర్షానికి తడిచిపోయిందన్నారు. దాదాపు 20 వేల బస్తాలు వర్షార్పణమైందన్నారు. మార్కెట్‌లో మార్కెట్‌కు వచ్చే యాసంగి ధాన్యానికి సరిపడా ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారని ధ్వజమెత్తారు. గంటసేపు రాస్తారోకో చేపట్టడంతో వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకొన్న తాసీల్దార్ రమేశ్‌రెడ్డి అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడారు. తడిచిన ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేశ్‌గౌడ్, విజయ్‌కుమార్, వెంకట్రావు, రఘువర్ధన్‌రెడ్డి, అశోక్, పరంజ్యోతి, భాను, మహేశ్వర్‌రెడ్డి, ధర్మానాయక్, నాగన్న యాదవ్, తిరుమల్, గిరి, ఇమ్రాన్, హుస్సేన్, సునీల్, రాము, బాబు నాయక్, పాషా, నారాయణ పాల్గొన్నారు.

నిలిచిపోయిన వాహనాలు

కాంటా పెట్టేదెప్పుడు

మద్దూరు, మే 3 : దొడ్డు వడ్లు కొనమంటూ రైతులను రోడ్డున పడేస్తారా.. రైతు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను పొలం గట్టు నుంచి తెచ్చినా కనికరం చూపకుండా సన్నాలు కావు, ఇవి దొడ్డు వడ్లు అసలే కొనమని రైతుల ఆశలపై నీళ్లు చల్లుతున్నారు. తమ కష్టాన్ని ధాన్యం రూపంలో తెచ్చి తర్వాత రైస్‌మిల్లుల ఎదుట పడిగాపులు పడుతున్న రైతును ఆదుకునేవాడు లేడు.. కాంటా పెట్టెడ్డుపుడు.. ఇంటికెళ్లేడ్పుడు, క్యూలో నిలపడ్డప్పుడు వర్షం పడితే మా ధాన్యం గతి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్న ఘటన నారాయణపేట జిల్లా మద్దూర్ మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. ధాన్యాన్ని రైస్ మిల్లు యజమానులు దింపుకోవడంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మద్దూర్ మండల కేంద్రం నుంచి పెదిరిపాడ్ రోడ్డులో ఉన్న పద్మావతి రైస్ మిల్లు వద్ద రైతులు 60 ట్రాక్టర్లకు పైగా క్యూలైన్‌లో నిలబడ్డ పట్టించుకునే నాథుడే లేడని శనివారం రైతులు ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై విజయ్‌కుమార్, అధికారులు ఘటన స్థలానికి చేరుకొని రైస్‌మిల్లు యాజమానితో మాట్లాడి రైతులకు 20 వాహనాలు టోకెన్లు ఇచ్చి దింపుతామని మాటా ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కానీ మిగితా 40 వాహనాల రైతులు మేము ఇంటికెళ్లే డ్పుడు మేము తెచ్చిన వాహనాల కిరాయిలు ఎంత అవుతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై సివిల్ సప్లయ్ డీటీ ఆనంద్‌కుమార్‌ను వివరణ కోరగా, 20వాహనాలకు టోకెన్లు ఇచ్చాం, ఇంకో 5వాహనాలకు అనుమతి తీసుకున్నాం. అలాగే అదివారం 25 వాహనాలకు పరిమిషన్ తీసుకుంటా, ఇప్పటికే లక్ష్మీవెంకటేశ్వర రైస్ మిల్లులో కూడా 14టోకెన్లు ఇచ్చాం. మిగిలిన వాహనాలు కూడా ఏదో ఒక రైస్ మిల్లులో టోకెన్లు ఇప్పిస్తామని తెలిపారు.

రైతులతో మాట్లాడుతున్న అధికారులు, బారులుదీరిన ధాన్యం ట్రాక్టర్లు

వనపర్తిలో మార్కెట్‌లో వర్షం నీటిలో ధాన్యం బస్తాలు

వర్షార్పణం

- వనపర్తి మార్కెట్‌లో తడిచిన ధాన్యం

వనపర్తి జిల్లాలో శుక్రవారం రాత్రి అకాల వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వాన పడడంతో రైతులు కుదేలయ్యారు. మార్కెట్‌కు విక్రయానికి తీసుకొచ్చిన ధాన్యం తడిసిపోయింది. సంచులు సగానికిపైగా తడిచిపోయాయి. మార్కెట్‌లో ఎక్కడ చూసినా వాన నీరే పారింది. రెక్కల కష్టం నీటిపాలు కావడంతో రైతులు ఆందోళన చెందారు.

వనపర్తిలో తడిచిన ధాన్యం పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు

నేడే 'నీట్'

- పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు
- ఉదయం 11గంటల నుంచే అనుమతి
- అరగంట ముందుగానే గేట్లు మూసివేత

పాలమూరులోని ఎన్టీఆర్ కళాశాలలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 3 : వైద్య కళాశాలల్లో (ఎం బీబీఎస్, బీడీఎస్) ప్రవేశాలకు దేశవ్యాప్తంగా ఈనెల 4న నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-2025 (నీట్)కు మహబూబ్‌నగర్ జిల్లాలో 13 కేంద్రాలు, గద్వాలలో 3 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 4,454 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 1:30గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరు. పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డులో ఉన్న సూచనలు అన్నింటిని తు.చా. తప్పకుండా పాటించాలి. ముఖ్యంగా అభరణాలు, భారీ దుస్తులు, బూట్లు, ధరించి పరీక్షా కేంద్రంలోకి రాకూడదు. అభ్యర్థుల ఇటీవలి పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటోలు రెండు, పోస్టు కార్డు సైజ్ కలర్ ఫొటోతో రావాలి.

జోగుళాంబ గద్వాలలో మూడు పరీక్షా కేంద్రాలు..

గద్వాల, మే 3 : జోగుళాంబ గద్వాల జిల్లాలో 1,029 మంది పరీక్షకు హాజరు కానున్నారని, ఈ మే రకు గద్వాల పట్టణంలో ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 3పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ సంతోష్ వెల్లడించారు. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం 9100901606 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ధాన్యం కొనాల్సిందే..

- భూత్పూరులో రైతుల ఆందోళన

కేంద్రంలో తడిసిన వడ్లను చూపుతూ మాట్లాడుతున్న సత్తూర్ బస్వరాజ్‌గౌడ్

భూత్పూర్, మే 3 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనాల్సిందేనని రైతులు డిమాండ్ చేశారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరులో కొనుగోలు కేంద్రం వద్ద కర్షకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గతంలో గోప్లా పుల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేటోళ్లు.. కానీ ప్రస్తుతం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దాదాపు 4 కి.మీ. దూరంలోని భూత్పూరుకు ధాన్యం తెచ్చి విక్రయించాల్సి వస్తుందని వాపోయారు. దీంతో సమయం, ఖర్చు అధికం అవుతున్నాయన్నారు. దీనికి తోడు శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి కేంద్రం వద్ద ఉంచిన ధాన్యం తడిచి.. కొట్టుకుపోయిందని ఆవేదన చెందారు. అధికారులు కల్లాల వద్దకు రాకుండా కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తీసుకురావాలని సూచించడం సరికాదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో కరోనా కాలంలోనూ అధికారులను కల్లాల వద్దకు వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేశారని గుర్తు చేశారు. రైతుల డిమాండ్ మేరకు చివరకు తాసీల్దార్ జయలక్ష్మి గోప్లా పుల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, మాజీ సర్పంచ్ సత్తూర్ నారాయణ గౌడ్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మురళీధర్ గౌడ్, రాములు, వెంకటయ్య, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పశువుల దవాఖాన వద్ద నిరసన

హన్వాడ, మే 3 : పశువుల డాక్టర్ అందుబాటులో ఉండడం లేదని పాడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సరైన సమయంలో పశువులకు చికిత్సలు అందడం లేదని మండిపడ్డారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం వేపూర్‌లోని పశువుల దవాఖాన ఎదుట రైతులు నిరసనకు దిగారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మూడ్రోజుల నుంచి వెటర్నరీ డాక్టర్ దవాఖానకు రావడంలేదని ఆరోపించారు. ఎండలు విపరీతంగా పెరిగిపోవడంతో మూగజీవాలకు సరైన చికిత్సలు అందించేందుకు దవాఖానలో ఎవరూ లేరన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సంబంధిత వెటర్నరీ డాక్టర్‌ను అడగగా.. నేను మూగజీవాలకు టీకాలు వేసేందుకు పల్లెలకు వెళ్తున్నానని, అందుకే దవాఖానకు రాలేదన్నారు.

అనాథ బ్రాహ్మణుడికి అంత్యక్రియలు

కొంకలలో అనాథ అంత్యక్రియలు నిర్వహిస్తున్న స్థానికులు

వడ్డేపల్లి, మే 3 : మతి స్థిమితం లేకుండా 30ఎళ్లుగా గ్రామంలో ఉన్న ఓ వృద్ధ బ్రాహ్మణుడు శుక్రవారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు పేరు కూడా తెలియని బ్రాహ్మణుడికి(75)కి గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎక్కడి నుంచి వచ్చాడో తెలియని బ్రాహ్మణుడు కొంకల గ్రామానికి చేరుకోగా గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, పోస్టు మాస్టర్ నాగేశ్‌గౌడ్‌లు 30 సంవత్సరాలుగా ఆయనకు తమ ఇంట్లోనే ఆశ్రయం కల్పించి భోజనం, వసతులను చేసుకున్నారు. ఆ బ్రాహ్మణుడు తన జీవిత కాలం మొత్తం చొక్క లేకుండా పంచె మాత్రమే ధరించేవాడని, కాగా వృద్ధాప్యంతో ఆయన శుక్రవారం రాత్రి మృతి చెందగా శనివారం ఉదయం బ్రాహ్మణుడిని పోషించిన చంద్రశేఖర్ గౌడ్, నాగేశ్‌గౌడ్‌లు ఆయనకు అంత్యక్రియలు చేపట్టారు. అంత్యక్రియలో గ్రామస్తులు స్వచ్ఛందంగా పాల్గొన్ని తమకు తోచిన సహకారులు అందించి ఆయన అంత్యక్రియలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాటి బ్రాహ్మణులైన దక్షిణామూర్తి, సత్యప్రకాశ్, రాజు, వినయ్ కౌశిల్ శర్మ, రమేశ్‌కుమార్‌లు అంత్యక్రియల్లో పాల్గొని మంత్రాలను జపించారు. 30ఏళ్లుగా ఆయనకు ఆశ్రయం కల్పించిన దాతలను గ్రామస్థులు కొనియాడారు.

ఫైనాన్స్ వేధింపులు

- ట్రాక్టర్ ఈఎంఐ చెల్లించాలని సంస్థ ప్రతినిధి నుంచి ఒత్తిడి
- రూ.18 వేల కోసం తిట్ల పురాణం
- భరించలేక చేగుంటలో టాక్టర్‌కు నిప్పంటించి యువకుడు

తిమ్మాజిపేట, మే 3 : ఫైనాన్స్‌లో కొనుగోలు చేసిన ట్రాక్టర్‌కు ఈఎంఐ చెల్లించాలని సంస్థ ఉద్యోగి ఒత్తిడి తీసుకురావడంతో భరించలేక యువకుడు ట్రాక్టర్‌కు నిప్పంటించిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించిన యువకుడు, స్థానికుల కథనం మేరకు.. తిమ్మాజిపేట మండలం చేగుంటకు చెందిన గడ్డం రవి వ్యవసాయదారుడు. పంటలు పండించడం తోపాటు ఇతరులకు వ్యవసాయ పనులు చేసేందుకుగానూ రెండేండ్ల కింద బంధువుల పేరుపై ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ఆ సమయంలో రూ.1.30 లక్షల డౌన్‌పేమెంట్ చెల్లించి.. మహబూబ్‌నగర్‌లోని ఫైనాన్స్ సంస్థలో మిగితా డబ్బులకు రుణం తీసుకున్నాడు. ఆరు నెలలకో సారి రూ.98 వేలు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇప్పటి వరకు రెండు వాయిదాలు చెల్లించాడు.. మూడో కిస్తు కోసం ఇటీవల పండించిన పంటను విక్రయించి రూ.80 వేలు కట్టాడు. మిగిలిన రూ.18 వేలు ఒకటి, రెండ్రోజులు చెల్లిస్తానని ఫైనాన్స్ ప్రతినిధులకు చెప్పాడు. కాగా శనివారం ఫైనాన్స్ ప్రతినిధి ఒకరు యువకుడి వద్దకు వచ్చి మిగిలిన డబ్బు చెల్లించాలని ఒత్తిడి తెచ్చాడు. తన వద్ద డబ్బులు లేవని.. రెండ్రోజులు సమయం ఇవ్వాలని వేడుకున్నాడు. ప్రతినిధి సంస్థ మేనేజర్ తోనూ ఫోన్‌లో మాట్లాడించగా.. విషయం తెలియజేయడంతో తర్వాత చెల్లించాలని చెప్పాడు. కానీ అక్కడే ఉన్న ప్రతినిధి మాత్రం డబ్బు చెల్లించాల్సిందేనని తెగేసి చెప్పాడు. దీని తోడు నానా దుర్భాషలాడడం తోపాటు రూ.80 వేలు చెల్లించినా రసీదు లేదని, ఈ డబ్బు లెక్కలోకి రాదన్నాడు. నీ ట్రాక్టర్‌ను కూడా సీజ్ చేస్తానని హెచ్చరించాడు. దీంతో దిక్కుతోచని స్థితిలో పెట్రోల్ తీసుకొచ్చిన యువకుడు ట్రాక్టర్‌పై పోసి నిప్పంటించాడు. దాదాపు ట్రాక్టర్ ముందుభాగం పూర్తిగా కాలిపోయింది. ఈ విషయమై నాగర్‌కర్నూల్ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని రవి తెలిపాడు.

నిప్పంటించడంతో కాలిపోయిన ట్రాక్టర్